క్లుప్తంగా

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్, వాలీబాల్ కిట్లు అందిస్తున్న సర్పంచ్ శిరీష, స్టీల్‌ప్లాంట్ మేనేజర్ వెంకటరమణ

మాకవరపాలెం: గ్రామీణ ప్రాంతాల్లో యువకులు క్రీడల్లో రాణించాలని మాకవరపాలెం సర్పంచ్ అల్లంపల్లి శిరీష, స్టీల్‌ప్లాంట్ మేనేజర్ వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం యువకులకు క్రికెట్, వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలన్నారు. ఆశ్రిత ట్రస్టు ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

52 మంది యువకుల రక్తదానం



కొండపాలెంలో రక్తదానం చేస్తున్న యువకులు

బుచ్చెయ్యపేట: మండలంలోని కేపీ అగ్రహారంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 52 మంది యువకులు రక్తదానం చేశారు. చేగువేరా ఫౌండేషన్, వందే భారత్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. కేపీ అగ్రహారం, కొండపాలెం, బుచ్చెయ్యపేట, అయితంపూడి, పైడంపేట, పెదమదీనా తదితర గ్రామాలకు చెందిన యువకులు రక్తదానం చేశారు. సర్పంచ్ గోపిశెట్టి శ్రీను, స్థానిక నాయకుడు ముచ్చకర్ల నాయుడు యువకుల్ని అభినందించారు.

26న గురుకుల మిగులు సీట్ల కోసం రాత పరీక్ష

గొలుగొండ: స్థానిక బాలుర గురుకుల కళాశాలలో మిగులు సీట్ల కోసం విద్యార్థులను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 6,7,8,9వ తరగతులలో మిగులు సీట్లు ఉన్నందున ఈ నెల 26న కళాశాలలో ఉదయం 10 గంటలకు రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కేటగిరీల వారీగా సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

వ్యాపారి మృతికి సంతాపం



వేమన రామారావు(ఫైల్)

మాడుగుల: స్థానిక పసుపు వ్యాపారి వేమన రామారావు(72) ఆదివారం మరణించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. మేలు రకం పసుపు ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు ఎగుమతి చేసి స్థానికంగా గుర్తింపు పొందారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీపీలు వేమవరపు రామధర్మజ, పుప్పాల అప్పలరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ సేనాపతి కొండలరావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరిలు తమ సంతాపాన్ని ప్రకటించి, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలి

మునగపాక : చదువుతో పాటు అన్ని రంగాలపైనా అవగాహన పెంచుకోవాలని భగవద్గీత బోధకులు భీశెట్టి లక్ష్మి కోరారు. మంగళవరపుపేటలోని మా ఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్, భగవద్గీత శ్లోకాలు వాటి అర్థాలపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ భగవద్గీత ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. గ్రంథాలయ అధ్యక్షులు భీశెట్టి ధనశ్రీను మాట్లాడుతూ గ్రంథాలయం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్రాయింగ్‌లో నైపుణ్యం పెంచుకోవాలన్నారు. గ్రంథాలయ కార్యదర్శి యల్లపు సంజీవరావు, వైద్యుడు సునీత, తులసి, అనురాధ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విత్తనాలు సిద్ధం.. సాగునీరే సందిగ్ధం

గత ప్రభుత్వం పుణ్యమా అని ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలు ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయి. అయినా తాండవ ఆయకట్టు రైతులు సాగుకు సాహసించలేకపోతున్నారు. ప్రాజెక్టులో నీటి మట్టం కనీస స్థాయికి పడిపోయింది. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవట్లేదు. ఐదేళ్లూ ఠంచనుగా వచ్చిన పెట్టుబడి సాయం కూటమి ప్రభుత్వంలో ఇంకా చేతికి అందలేదు. దీంతో ఎటూపాలు పోని స్థితిలో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- వరుణుడు కరుణిస్తేనే ఖరీఫ్ సాగు
- తాండవ ప్రాజెక్టులో అడుగంటిన నీటి మట్టం
- ప్రకృతి కన్నెర్ర చేస్తే 52 వేల ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం
- ఎటూ పాలుపోని స్థితిలో ఆయకట్టు రైతులు, ప్రాజెక్టు అధికారులు



తాండవ ప్రాజక్టులో అడుగంటిని నీటి మట్టం



ఆర్‌బికేలో సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

నాతవరం: ఈ ఏడాది తాండవ జలాశయ ఆయకట్టు పరిధిలో ఖరీఫ్ సీజన్ వరి సాగు వరుణుడిపైనే ఆధారపడి ఉంది. జిల్లాలో మేజరు ప్రాజెక్టు తాండవలో నీటి మట్టం అడుగంటిపోవడంతో ఖరీఫ్ సాగుపై రైతులు, అధికారులు అయోమయంలో ఉన్నారు. రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల ద్వారా వరి విత్తనాలు పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. వాతావరణ పరిస్థితుల రీత్యా రైతులు విత్తనాలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. గతంలో ఖరీఫ్ వరి విత్తనాలు వచ్చాయంటే రైతులు పోటీ పడేవారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు సాగుకు అనుకూలంగా లేవు. దీనికి తోడు తాండవ ప్రాజెక్టులో నీరూ లేదు. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సాగుపై రైతులు సందిగ్ధంలో పడ్డారు.

నారు వేశాక..నీరివ్వకపోతే..?

తాండవ జలాశయ నీరు అధారంగా అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు చెందిన నర్సీపట్నం, పాయకరావుపేట, ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లోని ఆరు మండలాల పరిధిలో 52వేల ఎకరాల్లో వరి సాగు ఆధారపడి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి మట్టం డెడ్ స్టోరేజీ(345 అడుగులు)కి చేరుకుంది. ఇప్పుడున్న పరిస్థితిని చూస్తూ భారీ వర్షాలు, తుపాన్లు వస్తే తప్ప క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి నీరు తాండవ ప్రాజెక్టులోకి చేరే అవకాశం లేదు. ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రాజెక్టు అధికారుల్లో సైతం భయం నెలకొంది. ఖరీఫ్ సాగుపై రైతులకు ఏం చెప్పాలో తెలియని అయోమయంలో ఉన్నారు. రైతులు వరి విత్తనాలు వేశాక నెల రోజుల వ్యవధిలో నాట్లు వేసుకోవాలి. లేకుంటే నారు ముదిరిపోయి దిగుబడులు తగ్గుతాయి. అందుకే నారు వేశాక, నీరు విడుదల చేయకపోతే పరిస్థితి ఏంటని రైతులు భయపడుతున్నారు.

అందని రైతు భరోసా

గత ప్రభుత్వంలో రైతులకు ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతు భరోసా పథకంలో పెట్టుబడి సాయం అందేది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నేటికీ రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ కాలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి మాత్రమే రూ.2 వేలు రైతుల అకౌంట్లలో చేరాయి. ఓ పక్క సాగు నీరు కోసం, మరో పక్క రైతు భరోసా పెట్టుబడి సాయం అందక రైతులు మల్లగుల్లాలు పడుతున్నారు. గతంలో తాండవ ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉండేది. ఖరీఫ్ సాగుకు పెట్టుబడి డబ్బులు ముందే వచ్చేవి. దీంతో రైతులు ధీమాగా ఖరీఫ్ సాగు పనులు చేసుకునేవారు. ఇపుడా పరిస్థితులు కానరావట్లేదని వాపోతున్నారు.

అందుబాటులో విత్తనాలు



ఖరీఫ్ సాగులో వరి పంట వేసుకునే రైతులకు అందించేందుకు ఆర్బీకేల్లో విత్తనాలు సిద్ధం చేశాం. ఆర్బీకేలో పేర్లను నమోదు చేసుకుని, రాయితీ ధర మినహా మిగిలిన మొత్తం చెల్లించి రైతులు విత్తనాలు పొందవచ్చు. విత్తనాలతో పాటు విత్తన శుద్ధి చేసుకునేందుకు సుడోమోనాస్ పౌడర్ కూడా 50 శాతం రాయితీపై సరఫరా చేస్తున్నాం. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగపరచుకోవాలి.

– శైలజ, వ్యవసాయాధికారి, నాతవరం మండలం

నీరు చేరితేనే.. సరఫరా!



తాండవ రిజర్వాయరులో నీటి మట్టం పెరిగితే ఖరీఫ్ సీజన్‌లో అయకట్టు భూములకు నీరు అందించగలం. ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీటి మట్టంతో ఆయకట్టుకు నీటిని విడుదల చేయలేం. ఖరీఫ్ సాగుకు సమయం ఉంది కాబట్టి ఈ లోపు భారీ వర్షాలు కురిసి ప్రాజక్టులోని నీటి మట్టం పెరుగుతుందని ఆశిస్తున్నాం. శివారు అయకట్టుకు సైతం నీరు చేరాలంటే ప్రాజెక్టులో నీటి మట్టం బాగా పెరగాలి.

– స్వామినాయుడు, ఈఈ, నీటి పారుదల శాఖ

వర్షం.. సాగుకు అనుకూలం



చౌడువాడలో కురుస్తున్న వర్షం

మాడుగుల రూరల్: తాజాగా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. ఆదివారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షం వల్ల రైతులు వరినారు మడులు సిద్ధం చేస్తున్నారు. ఈ వర్షం సాగుకు సాయపడుతోంది. గ్రామాల్లో సరుగుడు, టేకు, నారు వేసే పనిలో రైతులు బిజీబిజీగా ఉన్నారు. మెట్ట భూమిలో చెరకు దవ్వనాట్లు వేస్తున్నారు. దీంతో పాటు వంగ, బెండ తదితర కూరగాయలు, ఆకుకూరల పంటలకు అనుకూల వాతావరణం ఏర్పడినట్లు రైతులు చెప్తున్నారు.

కె.కోటపాడు: మండల వ్యాప్తంగా ఆదివారం తెల్లవారుజాము చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఇటీవల కాలంలో వేసవి తాపంతో ఇబ్బందులు పడ్డ ప్రజలు గత మూడు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో ఉపశమనం పొందారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో సరుగుడు, చోడిపంటను సాగు చేస్తున్న రైతులకు ఈ వర్షం మేలు చేస్తుందని స్థానికులు చెప్తున్నారు.

మూగ బోయిన బీఎస్ఎన్ఎల్ సిగ్నళ్లు

16 గ్రామాల వినియోగదారులకు ఇక్కట్లు



సరుగుడులో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్

నాతవరం: మండలంలోని సరుగుడు గ్రామంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్ నుంచి సిగ్నళ్లు రాకపోవడంతో మూడు రోజులుగా ఈ ప్రాంత వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సెల్ టవర్ అధారంగా సరుగుడు, సుందరకోట పంచాయతీల పరిధిలో 16 గ్రామాల వినియోగదారులు ఫోన్లు వాడుతున్నారు. ఇక్కడ బీఎస్ఎన్ఎల్ తప్ప ఇతర నెట్‌వర్క్‌లు లేవు. సరుగుడు గ్రామ సచివాలయంలో ప్రజలకు ఆన్‌లైన్ సేవలందించాలన్నా ఇదే దిక్కు. సెల్ సిగ్నళ్లు లేక ప్రవేట్ వ్యాపారులు, ఉపాధి కూలీలు సైతం అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ పరంగా ప్రజలకు వచ్చే వివిధ పథకాలు డబ్బులు సరుగుడులోని మినీ బ్యాంక్ ద్వారా తీసుకుంటున్నారు. సెల్ టవర్ పని చేయక ఈ లావాదేవీలు కూడా నిలిచిపోతున్నాయి. ఏ కొద్దిపాటి వర్షం పడినా, ఈదురు గాలులు వీచినా టవర్ నుంచి సిగ్నళ్లు నిలిచిపోతాయని స్థానికులు చెప్తున్నారు. ఇటీవల కాలంలో ఈ సమస్య తరచూ ఏర్పడుతోందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ముగిసిన కల్యాణ వేంకటేశుని కల్యాణోత్సవాలు



ఊంజల్ సేవలో భాగంగా స్వామివారిని ఉయ్యాలపై ఊరేగిస్తున్న భక్తులు



స్వామి వారి ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులు

పుష్పాంజలి సేవ, దర్పణ దర్శనంతో పులకించిన భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో జరుగుతున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలు శనివారం రాత్రితో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి పుష్పాంజలి సేవలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ రాపేట రామ కొండలరావు దంపతుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం స్వామి వారికి ఊంజల్ సేవ నిర్వహించారు. స్వామివారి దర్పణ దర్శనంతో ఉత్సవాలు ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు ఆరవల్లి సుదర్శనాచార్యుల పర్యవేక్షణలో జరిగిన ఉత్సవాలను తిలకించేందుకు స్థానికులతో పాటు వీరవల్లి, పోతనపూడి, జాలంపల్లి, ఎం.కోటపాడు, వల్లాపురం, జంపెన, ఒమ్మలి తదితర దూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆలయంలో నిత్య, ధూప, దీప, నైవేద్యాలకు విరాళాలిచ్చిన దాతలను, ఆలయంలో నిత్య సేవలు అందిస్తున్న శ్రీవారి సేవకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి పుట్టా బలరామమూర్తి, సభ్యులు పెంటకోట అప్పారావు, యల్లపు రాము, రాపేట బాబూరావు, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు, డీఆర్‌యూసీసీ సభ్యులు, మాడుగుల ఉప సర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు: అభయాంజనేయ స్వామి 6వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కె.కోటపాడులోని విశ్వబ్రాహ్మణ వీధిలో ఉన్న ఆలయంలో స్వామికి పూజలు నిర్వహించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరిపారు. అభయాంజనేయస్వామికి విశిష్ట పూజలను ఎం.నాగభూషణం నిర్వహించారు.

మోదమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మాడుగుల మోదమాంబ అమ్మవారు

మాడుగుల: స్థానిక మోదమాంబ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. పరిసర గ్రామాలు నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి, అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల అప్పలరాజు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 18న అమ్మవారి పండగ అనంతరం ఈ వారం భక్తుల తాకిడి పెరిగింది.

ఘనంగా మోదకొండమ్మ పండగ

దేవరాపల్లి: మండలంలోని కొత్తపెంటలో మోదకొండమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. రెండేళ్లకోసారి అమ్మవారి పండగను అత్యంత నియమ నిష్టలతో గ్రామస్తులు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తెల్లవారు జాము నుంచి గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. సాయంత్రం పసుపు కుంకుమలతో తీన్మార్ వాయిద్యాలు, మహిళల కోలాటం నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి దర్శించుకున్నారు. స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు, గ్రామ పెద్దలు, ప్రజలు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. రాత్రికి పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు.

21 రోజుల పాటు ధ్యానంపై అవగాహన

మునగపాక : మండలంలోని నాగులాపల్లి చంద్రశేఖర పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఈ నెల 24 నుంచి జూలై 14 వరకు ధ్యానంపై అవగాహన కార్యక్రమం జరుగుతుందని సీనియర్ పిరమిడ్ టీచర్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. 21 రోజుల పాటు ప్రతి రోజూ రాత్రి 8.30 గంటల నుంచి 9.45 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ధ్యానంతో ఆరోగ్యం అలాగే ఎదుగుదలపై అవగాహన, స్పష్టతతో అద్భుతంగా జీవించడానికి చిట్కాలు, పరివర్తనాత్మక ధ్యాన ప్రయాణం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సుజాత కోరుతున్నారు.

ఘనంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ అమ్మవారు

అనకాపల్లి : మండలంలోని మార్టూరు గ్రామంలో ఆదివారం మోదకొండమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే అమ్మవారి మహోత్సవం కావటంతో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు చైర్మన్ పి.పెంటారావు, కార్యదర్శి ఒ.మధు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జ్వరాలతో మంచం పట్టిన 'అర్ల'

- వాతావరణ మార్పులతో జ్వరాల విజృంభణ
- వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్తుల మొర



సులుం రాజులమ్మ



జ్వరంతో బాధ పడుతున్న వంజరి జ్ఞానేశ్వరి



చలిజ్వరంతో బాణం సింహాచలం



హేమ

రోలుగుంట: వాతావరణం మారింది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. మండలంలోని అర్ల గిరిజన గ్రామంలో పలువురు రోగాలతో మంచం పట్టారు. వీరు బుచ్చింపేటలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలంటే చాలా దూరం. సగం రోడ్డు కూడా బాగోదు. దీనికి తోడు సెలవు రోజుల్లో వైద్యులు కూడా అందుబాటులో ఉండరు. దీంతో ఎటూ పాలుపోని స్థితిలో రోగులు మంచాలకే పరిమితమయ్యారు. జ్వరాలతో గ్రామానికి చెందిన చిన్నారి వంజరి జ్ఞానేశ్వరి(3), కె.హేమ(5)తోపాటు బాణం సింహాచలం(18), సులుం రాజులమ్మ(48), పాడి ఉదయశ్రీ, పుష్పలత, బాణం అప్పారావు, గెమ్మిలి కృష్ణ, నూకాలమ్మ, చినకొండ, కిమిడి అచ్చయ్యమ్మ తదితరులు తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారు. వీరికి స్థానికంగా ఉన్న ఏఎన్ఎంలు అందించే వైద్యమే దిక్కవుతోంది. రోగులు సత్వరం కోలుకునేలా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, మెరుగైన వైద్య సేవలు అందించాలని గ్రామ సర్పంచ్ వండల వనిత, స్థానిక నాయకుడు బాణం రాజారావు కోరుతున్నారు. గ్రామంలో రోగాలపై వైద్యశాఖ ఉద్యోగి హరిబాబుని 'సాక్షి'సంప్రదించగా సమాచారం తెలుసుకున్నామని, స్థానికంగా ఉన్న ఆశ, ఏఎన్ఎంల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సోమవారం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటుచేసి, సత్వర వైద్యం అందించనున్నట్లు డాక్టర్ రాజు చెప్పారని పేర్కొన్నారు. వైద్యాధికారి సునీత ఉన్నత విద్యకు సంబంధించి పరీక్షకు హాజరవడానికి వెళ్లారని, తిరిగి వచ్చాక ఆమె కూడా వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.

ఆనాటి ఆ స్నేహమానంద గీతం



ఫకీర్‌సాహెబ్‌పేట జెడ్పీ హైస్కూల్ 1998-99 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు



సహచరులకు చిరు సత్కారం

చోడవరం రూరల్: పాతికేళ్ల క్రితం వారంతా ఒకే పాఠశాలలో పదవ తరగతి వరకు విద్యార్జన చేశారు. ఆ తర్వాత వేర్వేరు ప్రాంతాలు, వేర్వేరు వృత్తులు, ప్రవృత్తులలో నిలదొక్కుకున్నారు. ఇన్నాళ్లకు మళ్లీ వారంతా అదే చోట చేరి తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 1998–99 విద్యా సంవత్సరంలో పట్టణ శివారు ఫకీర్‌సాహెబ్‌పేట జెడ్పీ హైస్కూల్ టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో తిరిగి కలుసుకున్నారు. తమ చిన్ననాటి అనుభవాలను పంచుకుని ఆనందంగా గడిపారు. అప్పటి ఆకతాయి చేష్టల్ని గుర్తు చేసుకుని మరీ ఆటపట్టించుకున్నారు. ఉన్నత పాఠశాలను ఉన్నత చదువులు చదివినవారు, ఉన్నత స్థానాలను అందుకున్న వారి సంగతులు తెలుసుకుని వారి ఎదుగుదలకు మురిసిపోయారు. వారి పిల్లలు, ఆర్థిక స్థితిగతులను తెలుసుకుని తమ వంతు చేయగలిగేదేమైనా ఉంటే చేసేందుకు తమ చిరునామాలు, మొబైల్ నంబర్లు షేర్ చేశారు. 25 వసంతాల తమ స్నేహానికి గుర్తుగా చిరు కానుకలను ఇచ్చిపుచ్చుకున్నారు.

చురుగ్గా రామాలయ ముఖద్వార నిర్మాణం



తుది దశకు చేరుకున్న ముఖద్వారం పన

కె.కోటపాడు: పాచిలవానిపాలెం గ్రామంలో రామాలయ ముఖద్వారం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందుకు గ్రామస్తులు రూ.8 లక్షలు వెచ్చిస్తున్నారు. గ్రామం ప్రధాన వీధి వద్ద చేపట్టిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇటీవల తలుపులమ్మ ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా రామాలయ ముఖద్వారం పనులతోపాటు, మరిడిమాంబ ఆలయాన్ని పునర్నిర్మించేందుకు గ్రామస్తులు సంకల్పించారు. గ్రామస్తులు ఐక్యంగా ఆధ్యాత్మిక పనులు చేపట్టడంతో ప్రజల్లో భక్తిభావం మరింతగా పెరుగుతుందని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ ఆనందం వ్యక్తం చేశారు.

పేదలకు చేయూతనివ్వడమే వాసవీ క్లబ్ ధ్యేయం

డాన్ టు డస్క్‌లో పలు సేవా కార్యక్రమాలు



పేద మహిళలకు చీరలు అందిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు



వడ్డాదిలో విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మాడుగుల రూరల్: వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్‌ల ద్వారా పేదలకు చేయూతనివ్వడమే ప్రధాన ధ్యేయమని క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి.వి.సత్యనారాయణ తెలిపారు. డాన్ టూ డస్క్ కార్యక్రమంలో భాగంగా జంపెన వాసవీమాత ఆలయం వద్ద ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా జూన్ నెలలో క్లబ్ తరఫున సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఉన్న వాసవి సభ్యులు ఐక్యతతో పనిచేయాలన్నారు. కింతలి–గాదిరాయి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీపీ స్కూల్‌కు పిల్లలకు స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. చిరు వ్యాపారులకు పెద్ద గొడుగులు, దివ్యాంగులకు చేతి కర్రలు, పేదలకు చీరలు, దుస్తులు అందించారు. స్థానిక క్లబ్ వ్యవస్థాపకులు, జంపెన వాసవీ మాత ఆలయ కమిటీ చైర్మన్ పుట్టా మోహనరావు పర్యవేక్షణలో జరిగిన కార్యాక్రమంలో వాసవీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఎ.రత్నావతి, ఉపాధ్యక్షుడు శ్రీనాధు శ్రీనివాసరావులు మాట్లాడారు. జంపెనకు చెందిన మేడిశెట్టి అర్జునరావు సోదరులు, డి.గొటివాడకు చెందిన పుట్టా నాగరాజు ఆర్థిక సాయంలో కొత్తగా ఏర్పాటు చేసిన వాసవీ మాత ఆలయ ఉత్తరం, తూర్పు గేట్లను ప్రారంభించారు. కార్యక్రమములో క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి అర్జునరావు, కార్యదర్శి అనపగడ్డ అప్పారావు, కోశాధికారి పి.కొండారావు, జిల్లా కోశాధికారి అనపగడ్డ హరిబాబు, జోన్ చైర్మన్ నాచు గున్నయ్యశెట్టి, రీజనల్ చైర్మన్ శ్రీనాధు కన్నయ్యశెట్టి, ఉపాధ్యక్షుడు కోట్యాడ గున్నయ్యశెట్టితో పాటు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది గ్రామంలో వాసవీ క్లబ్ సభ్యులు ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వీరవల్లి, పోతన పూడి, వడ్డాది గ్రామాలకు చెందిన క్లబ్ సభ్యులు మూడు గ్రామాల్లో పేదలకు గొడుగులు, దుస్తులు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పాదచారులు కూర్చుని సేద తీరేందుకు రోడ్డు పక్కన బెంచీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు రత్నావతి, సత్యనారాయణ, సాంబమూర్తి, శ్రీనివాస్, రమేష్, మురళి, కన్నయ్యశెట్టి, గున్నయ్యశెట్టి, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.